క్లుప్తంగా

టెన్త్ ప్రతిభావంతులకు సన్మానం

గుంటూరు ఎడ్యుకేషన్: గత నెలలో విడుదలైన 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో గుంటూరు నగరంలోని ప్రభుత్వ, నగరపాలక సంస్థ పాఠశాలల నుంచి అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు గురువారం అవగాహన యోగా కేంద్ర ఆధ్వర్యంలో ఆర్టీసీ కాలనీలోని సన్మానించారు. ఈసందర్భంగా ఇజ్రాయిల్‌పేటలోని బొర్రా నాగేశ్వరరావు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాల నుంచి 582 మార్కులు సాధించిన విద్యార్థిని ఫాతిమా తబస్సుమ్‌తో పాటు అదే ప్రాంతంలోని సెయింట్ లారెల్స్ హైస్కూల్ నుంచి 588 మార్కులు సాధించిన మొహమ్మద్ గౌస్ నయీముద్దీన్‌ను శాలువాతో సత్కరించి, ప్రశంసాపత్రం అందజేశారు. అదే విధంగా నగరపాలక సంస్థ పాఠశాలల నుంచి 570కి పైగా మార్కులు సాధించిన మరి కొంత విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో అవగాహన యోగా కేంద్ర ప్రధాన యోగా చార్యుడు అచ్యుత ఇందుశేఖర్, సెయింట్ లారెల్స్ హైస్కూల్ డైరెక్టర్ మేకల రవీంద్రబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైల్వే డివిజన్ గ్రూప్-డి ఉద్యోగులకు ఘన సత్కారం

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో సజావుగా పని చేయడంలో అమూల్యమైన అద్భుతమైన సేవలను అందించినందుకు గ్రూప్ డి ఉద్యోగులు అభినందనీయులని డివిజన్ మహిళా సంక్షేమం అధ్యక్షురాలు ఎం.ఆశాలత అన్నారు. స్థానిక గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం కార్యాలయ ప్రాంగణంలో గురువారం డివిజన్ పరిధిలోని మే డేను పునస్కరించుకుని గ్రూప్ డి ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఆమె మాట్లాడుతూ భారతీయ రైల్వేలు సజావుగా సాగేందుకు తెరవెనుక పని చేసే గ్రూప్ డి ఉద్యోగులే నిజమైన హీరోలని అన్నారు. రైల్వేల ప్రతిష్టను నిర్మించడంలో గ్రూప్ డి సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. సిబ్బంది చేస్తున్న మంచి పనిని గుర్తించి వారి మనోధైర్యాన్ని పెంచడం మా బాధ్యత అని చెప్పారు. అనంతరం పలువురు డివిజన్ గ్రూప్ డి ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డివిజన్ మహిళా సంఘం కార్యదర్శి ఎన్.వి.సాయి అఖిల, పి.షర్మిల, సీనియర్ డీపీఓ షహబాజ్ హనూర్ పాల్గొన్నారు.

రూ.2 లక్షలు స్వాధీనం

గుంటూరు ఈస్ట్: ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు తీసుకెళుతున్న వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. విద్యానగర్ 1వలైనులో సూర్యదేవర కృష్ణ రూ.2 లక్షలు నగదుతో వెళుతున్నాడు. పోలీసులు తనిఖీలు చేస్తున్న సమయంలో ఎలాంటి ఆధారం లేకుండా నగదు తీసుకెళుతున్నట్లు ధ్రువీకరించి నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ టికెట్లు అమ్మే వ్యక్తి అరెస్ట్

లక్ష్మీపురం: రైల్వే స్టేషన్‌లో నకిలీ రిజర్వేషన్ టికెట్లను చేయించే వ్యక్తిని జీఆర్పీ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలానికి చెందిన ఒ.విజయ్ కుమార్ రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ల వద్ద రిజర్వేషన్ చేయిస్తానని ప్రయాణికులను మోసగిస్తుంటాడు. ప్రయాణికుల ఫిర్యాదు మేరకు అరెస్ట్ చేశారు. సీఐ మాట్లాడుతూ ప్రయాణికులు రిజర్వేషన్ కౌంటర్ వద్ద ఇలాంటి వారిని నమ్మి మోసపోవద్దని సూచించారు.

అనుమతి లేని టీడీపీ ప్రచార ఆటోపై కేసు

గుంటూరు ఈస్ట్: టీడీపీ నాయకులు అనుమతి లేని ఆటో ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండటంపై కేసు నమోదు చేశారు. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. ఆటో డ్రైవర్ వెంకట్రావు తన ఆటో టీడీపీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుని అనుమతి లేకుండా ప్రచారం చేస్తున్నాడు. పోలీసులు ఆటోను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదలందరి ఇళ్లు ఒక చరిత్ర

- జగనన్న ఐదేళ్ల పాలనలో ఎన్నో మైలురాళ్లు
- ఇలాంటి ప్రభుత్వం మళ్లీ రావాలని ప్రజల ఎదురుచూపులు
- ఎన్నికల కోడ్ అమల్లో ఉంటేనే వలంటీర్లపై కక్ష సాధిస్తున్నారు
- టీడీపీ వస్తే గ్రామ, వార్డు సచివాలయాలే ఉండవు
- చిల్లర ఆలోచనల వల్లే వృద్ధులకు అవస్థలు
- గుంటూరు పశ్చిమలో గెలుపు మాదే
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



తుఫాన్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం చేస్తూ ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి విడదల రజని, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, జిల్లా అధ్యక్షులు మండపాటి శేషగిరిరావు

పట్నంబజారు: పేదలందరికీ ఉచితంగా ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణాలు అనేది ఒక గొప్ప చరిత్ర అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. 39వ డివిజన్ మారుతీనగర్, తుఫాన్ నగర్ ప్రాంతాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ఏకంగా 32.5 లక్షల మందికి ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇచ్చి, వారందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని చెప్పారు. ఇప్పటికే 22.5 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టి, ఇప్పటికే 9.2 లక్షలకుపైగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతోందన్నారు. మిగిలిన ఇళ్ల నిర్మాణం కూడా వేగంగా జరుగుతోందని, అక్కచెల్లెమ్మల పేరిట ఇళ్ల పట్టాలు, రిజిస్ట్రేషన్, ఇంటి నిర్మాణానికి పావలా వడ్డీకే రూ.35 వేల రుణం, ఉచితంగా ఇసుక, తక్కువ ధరకే నిర్మాణ సామగ్రి అందజేశామని చెప్పారు. దేశంలోనే తొలిసారిగా లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలపై సర్వహక్కులూ కలిప్తూ కన్వేయన్స్ డీడ్స్, రిజిస్ట్రేషన్ చేసి మరీ ఇచ్చిన ప్రభుత్వం తమదని పేర్కొన్నారు. ఇళ్ల పట్టాల పంపిణీ నిరంతరం కొనసాగే ప్రక్రియ అని చెప్పారు. అర్హులై ఉండి, ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి ఇళ్ల పట్టాలు ఇచ్చే కార్యక్రమాన్ని కొనసాగిస్తూ వచ్చే ఐదేళ్లలో మిగిలిపోయిన మరో పది లక్షల ఇళ్ల నిర్మాణాలు చేపడతామని వివరించారు.

పట్టణాల్లో ఆవాసాలకు ఏటా రూ.వెయ్యి కోట్లు

నగర, పట్టణ పేదలకు 300 చదరపు అడుగుల ఇళ్లపై అప్పుల భారాన్ని తమ ప్రభుత్వమే భరించిందని చెప్పారు. సొంతింటి కలను సాకారం చేశామన్నారు. 300 చదరపు అడుగుల ఇంటిని లబ్ధిదారులకు రూపాయికే అందించామని చెప్పారు. 360, 430 చదరపు అడుగుల ఇళ్లపై లబ్ధిదారులు మొదట కట్టాల్సిన వారి వాటాలో 50 శాతం సబ్సిడీ ఇచ్చామని తెలిపారు.

వైఎస్ జగన్‌ను సీఎంని చేసుకుందాం

వైఎస్ జగనన్నను తిరిగి సీఎంని చేసుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మద్దాళి గిరిధర్ చెప్పారు. ఏనోటా విన్న ఆ ఇంటికి అందిన సంక్షేమం గురించి వివరిస్తూ ప్రతి ఒక్కరూ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. కచ్చితంగా సంక్షేమ సారథిని మరో మారు సీఎంని చేసుకోవడం తథ్యమన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మండపాటి శేషగిరిరావు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ ముందుకు సాగారన్నారు. కుల, మత, ప్రాంత, రాజకీయ బేధాలు లేకుండా ప్రతి ఒక్కరికి సంక్షేమాన్ని అందజేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, అధ్యక్షులు, కన్వీనర్లు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేసవిలో కిడ్నీలు జరభద్రం..

- ఎండలకు కిడ్నీలు ఫెయిల్ అవుతున్నాయి...
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



మూత్ర పిండాలు

గుంటూరు మెడికల్: గుంటూరు శ్రీనగర్‌కు చెందిన సాంబశివరావు ప్రైవేటు కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. తన విధుల్లో భాగంగా ఎండను లెక్కచేయకుండా ద్విచక్ర వాహనంపై తిరుగుతున్నాడు. తీవ్రంగా ఎండలు ఉండటంతో అస్వస్థతకు గురై చికిత్సకోసం ఆస్పత్రికి వెళ్లగా కిడ్నీలు దెబ్బతినడం ప్రారంభమయ్యాయని నెఫ్రాలజిస్టులు వైద్యపరీక్షలు చేసి నిర్ధారించారు. వేసవిలో జాగ్రత్తలు తీసుకోకపోతే కిడ్నీలు పూర్తిగా దెబ్బతింటాయని వెల్లడించారు. ఇలా ఉద్యోగస్తులు, రోజువారి కూలీలు, తోపుడుబండ్లపై చిరు వ్యాపారాలు చేసుకునే వారు ఎక్కువగా ఎండలో ఉండి విధులు నిర్వహించే వారు వేసవిలో కిడ్నీలు దెబ్బతినకుండా తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని నెఫ్రాలజిస్టులు సూచిస్తున్నారు. వేసవి ప్రారంభం అయ్యిందంటే ఎండ వేడిమి వల్ల శరీరం పలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. వేసవిలో తప్పని సరిగా కొద్దిపాటి ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. ముఖ్యంగా శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపించి, రక్తాన్ని శుభ్రం చేసే కిడ్నీలు ఎండలకు ఫెయిల్ అయ్యే ప్రమాదముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రతి ఏడాది వేసవిలో పలువురు కిడ్నీ ఫెయిల్ అయ్యి చికిత్స పొందుతున్నట్లు నెఫ్రాలజిస్టు తెలిపారు. వేసవిలో కిడ్నీలను కాపాడుకునేందుకు కొద్దిపాటి జాగ్రత్తలు పాటించాలని వైద్యులు వెల్లడిస్తున్నారు.

ప్రతాపం చూపుతున్న భానుడు...

..కొద్దిరోజులుగా ఎండలు తీవ్రంగా మండిపోతున్నాయి. వడగాడ్పులు బాగా వీస్తున్నాయి. ఉష్ణోగ్రత 44 డిగ్రీల వరకు నమోదవుతోంది. భానుడు తన ప్రతాపం చూపిస్తూ ఉండటంతో కొద్దిరోజులుగా ప్రజలు ఎండలతో అల్లాడిపోతున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే రెంటచింతల గ్రామం ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే ఉంది. ఎండలను లెక్కచేయకుండా ఉపాధికోసం, ఉద్యోగాల కోసం ఎండలో తిరిగితే రోగాలు వచ్చే ప్రమాదం ఉంది. ఎండలో విపరీతంగా తిరగటంతో శరీరంలో లవణాలు తగ్గిపోయి (పొటాషియం, సోడియం లెవల్స్) కిడ్నీలు పని చేయవు. కిడ్నీలు ఫెయిల్ అవ్వకుండా కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎండలకు కొత్తగా కిడ్నీ జబ్బుల బారిన కొంత మంది పడుతుండగా , కిడ్నీ జబ్బుతో బాధపడుతున్న వారు మరింత తీవ్ర ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని వైద్యులు తెలిపారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

..ప్రతిరోజూ తప్పనిసరిగా ఒంటికి సరిపడ నీటిని తీసుకోవాలి. కాటన్, తేలికపాటి వస్త్రాలు ధరించాలి. నోరు, గొంతు పొడిబారడం, మూత్ర విసర్జన తగ్గడం, లేదా ముదురు రంగు మూత్రం రావడం, అలసట పెరగడం, మైకం, కండరాల తిమ్మిరి, వేగవంతమైన హృదయ స్పందనలు ఉంటే తప్పనిసరిగా అప్రమత్తంగా ఉండి ఎక్కువ నీటిని తాగాలి. సూర్యరశ్మిలో లేకుండా నీడనే ఉండాలి. నీరు, పండ్ల రసాలు బాగా తీసుకోవాలి. శీతల పానీయాలకు దూరంగా ఉండాలి. ఉప్పు, కొవ్వు, చక్కెర తక్కువగా ఉన్న సమతుల్య ఆహారం తీసుకోవాలి. యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే పండ్లు, కూరగాయలు, ఆహారాలు తీసుకోవడం ద్వారా మూత్ర పిండాలు దెబ్బతినకుండా ఉంటాయి.

కిడ్నీ రోగులు జాగ్రత్తలు తీసుకోవాలి...



కిడ్నీ జబ్బుతో బాధపడుతూ డయాలసిస్ వైద్యం చేయించుకునేవారు వేసవి ఎండను తాళలేక ఎక్కువగా మంచినీటిని తాగుతారు. ఫలితంగా ఆయాసం ఎక్కువై వారంలో ఒకరోజు డయాలసిస్ చేయించుకునేవారు వారంలో రెండు లేదా మూడుసార్లు చేయించుకోవాల్సి వస్తుంది. దీని నివారణ కోసం ఐస్‌క్యూబ్స్‌ను వినియోగించటం వలన దాహం వేయకుండా ఉంటుంది. వేసవిలో కిడ్నీ రోగులు తప్పనిసరిగా వైద్యుల సలహాలు పాటించాలి. గుంటూరు జీజీహెచ్‌లో కిడ్నీ వ్యాధులకు కార్పొరేట్ వైద్యసేవలు ఉచితంగా అందిస్తున్నాం.

– డాక్టర్ గొంది శివరామకృష్ణ, నెఫ్రాలజి విభాగాధిపతి, గుంటూరు జీజీహెచ్

కిడ్నీ రోగులు ఎండలో తిరగకూడదు....



కిడ్నీ రోగులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎండలో తిరుగకూడదు. సాధారణ ప్రజలు ఎండకు సరిపడా మంచినీరు తాగకపోతే కిడ్నీలు రాళ్లు ఏర్పడి బాధిస్తాయి. రోజూ కనీసం నాలుగు నుంచి ఐదు లీటర్లు సాధారణ ప్రజలు తాగునీటిని తాగటం వల్ల వేసవిలో కిడ్నీలు పాడవకుండా కాపాడుకోవచ్చు. ఎండలో కూలిపనులు చేసేవారికి వడదెబ్బ తగిలి కిడ్నీలు ఫెయిల్ అవుతాయి. ఎండలు తగ్గే వరకు ప్రతి ఒక్కరూ ఎండలో తిరుగకుండా ఏమైనా పనులు ఉండే సాయంత్రం వేళల్లో చేసుకోటం ద్వారా కిడ్నీలను దెబ్బతినకుండా కాపాడుకోవచ్చు.

– డాక్టర్ చింతా రామకృష్ణ, సీనియర్ నెఫ్రాలజిస్ట్, గుంటూరు

వ్యాపారులకు అండగా సీఎం వైఎస్ జగన్



వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని వ్యాపారస్తులను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే గిరిధర్

ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

పట్నంబజారు: వ్యాపార వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను తీసుకొచ్చారని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం గుంటూరులోని పట్నంబజారు, ఏలూరు బజారు పరిసర ప్రాంతాల్లో వ్యాపార వర్గాల ప్రముఖులను కలిసి వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలియజేయాలని కోరారు. గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా నిలబడుతున్న ఎమ్మెల్యే కిలారి రోశయ్య, తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా, పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజినిలను గెలిపించాలని కోరారు. అనంతరం వ్యాపారస్తులు, ఆర్యవైశ్య సంఘాల నాయకులతో మాట్లాడుతూ ముందుకు సాగారు. వ్యాపార వర్గాలతో ప్రత్యేకంగా సమావేశమై రానున్న ఎన్నికలు ఎంత కీలకమని పేర్కొన్నారు. తద్వారా రాష్ట్రంలో సుపరిపాలన అందించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మరోమారు వ్యాపార వర్గాలకు మేలు జరగాలంటే సీఎం జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు నేరేళ్ల సురేష్, గుడిపాటి భాస్కర్, రాయవరపు అశోక్, బిజినేపల్లి శరత్, మద్దాళి సుధాకర్, నూనె కిషోర్, పువ్వాడ నారాయణ, పువ్వాడ అమర్‌నాథ్, పి.సి.కె.బాబ్జి, నాగేశ్వరరావు, నంబూరు హరీష్, గ్రంధి శ్రీమాన్ పాల్గొన్నారు.

హోం ఓటింగ్ పకడ్బందీ నిర్వహణకు 11 బృందాలు

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మే 3వ తారీఖున గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో నిర్వహించే హోం ఓటింగ్‌ను పకడ్బందీగా నిర్వహించానికి 11 బందాలను ఏర్పాటు చేశామని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్, పశ్చిమ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్.ఓ) కె.రాజ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా అమలు చేయుచున్న హోం ఓటింగ్ విధి, విధానాలపై ప్రతి ఒక్కరూ సమగ్ర అవగాహన కలిగి ఉండాలని కోరారు. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి హోం ఓటింగ్ ప్రారంభమవుతుందని, హోం ఓటింగ్‌ను రహస్య ఓటింగ్ విధానంలో చేపడతామని పేర్కొన్నారు. ఓటింగ్ జరిగే సమయంలో ఓటింగ్ ప్రక్రియను పూర్తి స్థాయిలో వీడియో రికార్డ్ చేస్తామన్నారు. ఈ ఓటింగ్ ప్రక్రియలో పోటీలో ఉన్న అభ్యర్థులు లేదా వారి పోలింగ్ ఏజెంట్లు ఉండవచ్చని, కాని వారు ఎటువంటి ప్రచారం గాని, పార్టీ గుర్తులు ప్రదర్శించకూడదన్నారు. ఓటు వేసే వారికి ప్రత్యేక కంపార్ట్‌మెంట్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. హోం ఓటింగ్ సమయంలో శాంతి భద్రతల పర్యవేక్షణకు పోలీసు సిబ్బంది ఉంటారని, ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పకుండా కఠినంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో హోమ ఓటింగ్ నిర్వహణ కోసం 11 బృందాలను ఏర్పాటు చేశామమని, ఆయా బృందాలను పర్యవేక్షణకు ఏఆర్‌ఓల ఆధ్వర్యంలో మైక్రో అబ్జర్వర్ల టీంలను నియమించుట జరుగుతుందన్నారు.

శ్రీశ్రీకి ఘన నివాళి



అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ

లక్ష్మీపురం: ఆధునిక ఆంధ్ర సాహిత్య సాహిత్యంలో అభ్యుదయ యుగానికి నాందీ ప్రస్తావన చేసిన మహాకవి శ్రీశ్రీ కవిత్వంలో నూతన శకానికి ఆద్యుడని, సాహితీ జగత్తులో ఆయన రచనలు అజరామరంగా నిలిచిపోతాయని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం మహాకవి శ్రీశ్రీ జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పెనుగొండ మాట్లాడుతూ ధనిక స్వామ్య దురాశా పిశాచానికి బలి అయి అల్లాడుతున్న పేదల వాణిని వినిపింపజేసిన విప్లవ కవి శ్రీశ్రీ అన్నారు. శ్రీ శ్రీ తెలుగులో వినూత్న కవితా ప్రయోగశీలిగా, అభ్యుదయ కవితా మార్గదర్శకుడిగా భావ కవితా యుగంలో,భాషలో,చందస్సులో కొత్త పోకడలను సృష్టించారన్నారు.

బ్రీత్ ఎనలైజర్లు ఏర్పాటు చేయాలి

అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద మద్యం తాగి వచ్చే వారిని గుర్తించేందుకు బ్రీత్ ఎనలైజర్స్ ఏర్పాటు చేయాలని విపరీతమైన ఎండల కారాణంగా పోలింగ్ సమయాన్ని రాత్రి ఎనిమిది గంటల వరకూ పొడిగించాలని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విశ్రాంత ఆర్టీసి విశ్రాంత అధికారి వి.ఎస్.ఎన్ మల్లేశ్వరరావు అన్నారు. స్థానిక సంస్థ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఎక్కడా అమలు కావడం లేదని చాలా మంది తాగి ఓటు వేయటానికి వచ్చి ఆమత్తులో ఎవరికో వేస్తున్నారని అన్నారు.

మత్తు వైద్య విభాగానికి రూ.5 లక్షల వితరణ



వైద్య పరికరాలను జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు అందజేస్తున్న జింకానా ప్రతినిధులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అభివృద్ధికి జింకాన చేస్తున్న సేవలను మరువలేమని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. గురువారం జింకానా ప్రతినిధి డాక్టర్ త్రిపురనేని రవి ఆర్థిక సహకారంతో జింకాన కో ఆర్డినేటర్లు డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ బాల భాస్కర రావు రూ.5 లక్షల రూపాయల విలువ చేసే వైద్య పరికరాలను మత్తు వైద్య విభాగానికి సూపరింటెండెంట్‌కు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ మత్తు వైద్య విభాగంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు డాక్టర్ త్రిపురనేని రవి ఆర్థిక సహాయంతో వైద్య పరికరాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మత్తు విభాగాధిపతి పోలయ్య పాల్గొన్నారు.

మానసిక వైద్య విభాగంలో..

గుంటూరు మెడికల్: రోగులకు ఎలాంటి నొప్పి, బాధ లేకుండా మత్తు ఇచ్చి షాక్ ట్రీట్ మెంట్ వైద్య సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. వైద్య విభాగంలో ఎప్పటి నుంచో షాక్ ట్రీట్‌మెంట్ చికిత్స కోసం ఆపరేషన్ థియేటర్ సౌకర్యం లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్న విషయాన్ని సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ దృష్టికి మానసిక విభాగాధిపతి నీలి ఉమాజ్యోతి తీసుకెళ్లారు. వెంటనే దాతల సహకారంతో షాక్ ట్రీట్‌మెంట్‌కు అవసరమైన పరికరాలను, ఆపరేషన్ థియేటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. గురువారం నూతనంగా ఏర్పాటు చేసిన ఆపరేషన్ థియేటర్‌లో డాక్టర్ రామరాజు సహకారంతో రోగికి చికిత్స చేశారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ వద్దాది వెంకట కిరణ్, సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ బి.వెంకట సతీష్ కుమార్, ఆషా సజని, గంగమ్మ పాల్గొన్నారు.

వేసవిలో విజ్ఞానం.. వినోదం



క్రాఫ్టస్ తయారీలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు



డ్రాయింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



కీబోర్డుపై విద్యార్థులకు శిక్షణ..



ఐస్ పుల్లలతో తయారు చేసిన చిత్రాలు

వేసవి సెలవులు ఇవ్వడంతో నగరంలోని వివిధ పాఠశాలలు, శిక్షణ కేంద్రాలు వేసవి శిక్షణ శిబిరాలను ప్రారంభించాయి. విద్యార్థులకు ఆటవిడుపుగా ఆట, పాటలు, సంగీతంతో పాటు యోగా శిక్షణ కార్యక్రమాలతో సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీసే విధంగా ఆసక్తికరమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. చెత్త వ్యర్థాలకు కళాత్మకమైన రూపాలను తీర్చిదిద్దడం, సంగీత వాయిద్యాలపై శిక్షణ, కథలు చెప్పడం, సంప్రదాయ, ఆధునిక నృత్యం, రోల్ ప్లే, డ్రాయింగ్, పెయింటింగ్, చేతిరాత, తోలుబొమ్మలాట, వ్యాయామ సాధనతో పాటు క్రీడాంశాల్లో శిక్షణ కల్పిస్తున్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఇళ్లలో ఉండి, స్మార్ట్‌ఫోన్లు, టీవీలకు అతుక్కునిపోకుండా వారిలో అంతర్లీనంగా దాగిన సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీసే విధంగా ఉపాధ్యాయుల పర్యవేక్షణలో వారికి ఆయా అంశాల్లో శిక్షణ కల్పించడం ద్వారా శారీరక ఉత్సాహం, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తున్నారు. – గుంటూరు ఎడ్యుకేషన్



వేస్ట్ మెటీరియల్‌తో తీర్చిదిద్దిన కళారూపాలు

వివిధ రంగాల కార్మికులకు సన్మానం



నగరంపాలెం: స్థానిక భారత్‌పేటలోని సేవా సదన్ కార్యాలయంలో ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. వై.సూర్య కుమారి(స్టాఫ్ నర్స్) చింతా రజిని(ప్రముఖ గాయని), బి.శ్రీనివాసరావు(ల్యాబ్ టెక్నీషియన్) శెట్టి సాంబయ్య (ప్రముఖ గాయకుడు, కార్పెంటర్), లక్ష్మణ్ నాయక్(ఆటో)ను సత్కరించారు. కార్యక్రమానికి సేవాసదన్ అధ్యక్షులు మిరియాల గోపీకుమార్ అధ్యక్షత వహించి, ప్రసంగించారు. ముఖ్య అతిధిగా అఖిల భారత పంచాయతీ పరిషత్(న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు హాజరయ్యారు.